

25న పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరులో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు 12 కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారని వెల్లడించారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ ఆపై చదువు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతోపాటు పాన్, ఆధార్ కార్డులతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుండి 20వేల వరకు జీతం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6302636174, 7569923256 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

వరద తగ్గినా..వీడని కష్టాలు..

- రోడ్లపై పేరుకుపోయిన చెత్త
- తాత్కాలికంగా వేసుకున్న గుడిసెల్లోనే జీవనం..
- విఆర్.పురం, చింతూరు రహదారిపై నీరు
- ముంపు గ్రామాల్లో కలెక్టర్, సిపిఎం నాయకుల పర్యటన

ప్రజాశక్తి-విఆర్‌పురం: గోదావరి శాంతించినా ముంపు బాధితుల కష్టాలు వీడటం లేదు. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు భద్రాచలం వద్ద 44.60 ఉంది నీటిమట్టం. విఆర్‌పురం నుంచి చింతూరు వెళ్లే ప్రధాన రహదారి గ్రామాల మధ్య వరద నీరు తొలగిపోలేదు. ఐదు రోజులుగా ఈ మార్గంలో రాకపోకలు లేవు. ఈ రెండు మండలాల మధ్య సోకులేరు, వద్ద ప్రధాన రహదారిపై కిలో మీటర్ల మేరకు వరద నీరు ప్రవహిస్తోంది. విఆర్‌పురం మండలంలో సుమారు 60 గ్రామాలకు రాకపోకలు లేకపోవడంతో వ్యవసాయ పనులు చేసుకునేందుకు కావల్సిన డీజిల్, వ్యవసాయ పరికరాల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విఆర్‌పురం మండలంలోని శ్రీరామగిరి, సీతంపేట, తుష్టివారిగూడెం, ప్రత్తిపాక, కన్నాయిగూడెం, చింతరేవుపల్లి మధ్యలో రహదారులపైన వరదనీరు ప్రవహిస్తుండంతో ఆ గ్రామాల వారు పడవల పైనే రాకపోకలు సాగిస్తున్నారు.విఆర్‌పురం- వడ్డిగూడెం మధ్య పడవలపై ప్రయాణాలు చేస్తున్నారు. సున్నంవారి గూడెం నుండి కన్నాయిగూడెం మధ్యలో రహదారులపై చెత్త చెదారం పేరుకుపోయింది అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పునరవాస కేంద్రాల్లో పాకలు చుట్టూ బ్లీచింగ్ చల్లించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

చింతూరు : మండలంలోని సోకిలేరు కొయ్యోగు వాగులు ఇంకా తగ్గుముఖం పట్టలేదు. ఒడిశా, ఆంధ్రా, చత్తీస్‌గఢ్ రహదారులు ఇంకా తెరుచుకోలేదు. రెండు రోజుల నుంచి భారీవాహనాలు సైతం రోడ్లపైనే బారులు తీరాయి. చింతూరు సంత ప్రాంతంలో కొన్ని నివాసాలు ముంపునకు గురయ్యాయి. చత్తీస్‌గఢ్, ఒరిస్సాలో ఉన్న ఇంద్రావతి, పొట్టేరు నదులు శాంతించాయని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. శుక్రవారం రాత్రికి వరద ప్రవాహం తగ్గుతుం దని భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ దినేష్‌కుమార్ ముంపు మండలాలైన వీఆర్‌పురం, కూనవరం వడ్డిగడెం గ్రామాల్లో పర్యటిస్తూ వరదపరిస్థితిని అంచనా వేస్తున్నారు.

ఎటపాక: భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. రాయనపేట వద్ద జాతీయ రహదారి నుండి వరద నీరు తగ్గడంతో అంతర్రాష్ట్ర సర్వీసులు యధావిధిగా కొనసాగుతున్నాయి. వీరాయిగూడెం, మురుమూరు గ్రామాలకు మాత్రం వరదనీరు తగ్గకపోవడంతో రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని మురుమూరు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



తాత్కాలికంగా వేసుకున్న గుడిసెల్లో సర్దుకున్న సామగ్రి

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

విఆర్‌పురం: మండలంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ ఇన్‌చార్జి పిఒ, సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్‌తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పరిస్థితిని సమీక్షించారు. శ్రీరామగిరి, తోటపల్లి గ్రామాలో పర్యటించి పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడారు. 40 కుటుంబాల వారికి అవసరమైన నిత్యావసర సరుకులు, రగ్గులు పంపిణి చేశారు. వీరితో పాటు ఎఎస్‌డిఎస్ డైరక్టర్ గాంధీబాబు, విఆర్‌పురం ఎంపిడిఒ ఇమ్మానుయేల్ వి.ఆర్ పురం తహసీల్దార్ వై.సరస్వతి, జెడ్‌పిటిసి రంగారెడ్డి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ముంపులోనే ఉన్న ఒడ్డుగూడెం కాలనీ రోడ్డు

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

విఆర్‌పురం: సిపిఎం బృందం జీడిగుప్ప, కొటారుగొమ్ము, ములకపల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వరద బాధితులు గుట్టలపై ఉన్నటువంటి పునరావాస పాకల్లో నివాసం ఉంటున్నామని మూడు రోజుల నుండి విద్యుత్ సౌకర్యం లేదని నిత్యవసర వస్తువులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు సిపిఎం మండల కార్యదర్శి పులిసంతోష్‌కుమార్ తెలిపారు. ఆయనతో పాటు సిపిఎం నాయకులు సోయం చినబాబు, పంకు సత్తిబాబు, ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్, పోడియం శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ఇ - క్రాప్ చేసి అన్నదాత సుఖీభవ అందించాలి

విఆర్‌పురం: మండలంలోని 2008-2009 సంవత్సరంలో పోలవరం ముంపులో ఉన్నట్లు గుర్తించి మండలంలోని చాలా గ్రామాల ప్రజల భూములకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి 6 1/2 ఎకరాల మినహాయింపు భూములకు భూమికిభూమి పరిహారం చూపించక పోగా ప్రస్తుతం ప్రభుత్వం నుండి రైతులకు వచ్చే అన్నదాత సుఖీభవ , ఇక్రాప్ వంటివి రాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సిపిఎం నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా శ్రీరామగిరి వెళ్లి వస్తున్న కలెక్టర్‌ని తోటపల్లి గ్రామంలో గ్రామస్తులతో కలిసి సిపిఎం మండల కార్యదర్శి పులిసంతోష్‌కుమార్, ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్ రైతులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సరస్వతిని ఆదేశించారు. దీంతోపాటు తోటపల్లి (మొద్దులగూడెం) గ్రామాన్ని మొదటి ముంపు జాబితాలో చేర్చాలని కోరారు. జిల్లా నాయకులు చినబాబు, పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



బురద రోడ్డుపై ఆటోను తోస్తున్న వాహనదారులు

రహదారులు బురదమయంతో అవస్థలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని బూర్జ పంచాయతీ పరిధిలోని తుంబవలస గ్రామ రహదారి పనులు రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు పూర్తికాలేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మరింత దెబ్బతింది. గ్రామానికి వెళ్లే మార్గం మట్టి దారి గోతులు ఏర్పడటంతో నిత్యావసర సరుకులు తెచ్చుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో ఆరోగ్య కేంద్రానికి చేరుకోవడం కష్టసాధ్యమైపోయింది. వాహనాలు నడవని పరిస్థితిలో గ్రామస్తులు బండ్లను నెట్టుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇదే ప్రధాన రహదారి కావడంతో ఎటు వెళ్ళాలన్నా కష్టతరంగా మారుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తుంబవలస గ్రామంలో బీటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ పరిధిలోని ఎర్రవరం జలపాతానికి వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారికి అనేక చోట్ల గండిపడి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు మట్టి రోడ్డు కావడంతో బురదమయంగా మారింది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా గొందిపాకల, సమగిరి, ఎర్రవరం, తాటిపాకలతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఎటు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సేవలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. రోగులు సమయానికి ఆసుపత్రులకు చేరుకోలేక ప్రాణాల ముప్పును ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి. రహదారి మరమ్మతులకు అధికారులు హామీ ఇస్తారు కానీ పనులు ప్రారంభం కావడం లేదు. చిన్న చిన్న గండులు పెద్ద రంధ్రాలుగా మారి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇలాగే వదిలేస్తే వాహనాలు తిరగలేని స్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.



బురదమయంగా ఉన్న రోడ్డు

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



విద్యార్థినిలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విద్యార్థుల ఆరోగ్యంపై సిబ్బంది శ్రద్ధ వహించాలని, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఏకలవ్య, స్థానిక గురుకుల బాలికల పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ఎలాగా అందుతున్నదీ ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యా యులు ఏ విధంగా పాఠాలు బోధిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల సిబ్బందితో మాట్లాడారు. పదోతరగతి పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల యాజమానులు తమ పశవులను రోడ్డుపై వదలకూడదని ఇంటి వద్ద కట్టుకునేలాగా అధికారుల చర్యలు చేపట్టాలని సూచిం చారు. మాటవినని యజమానుల వారి పశువులను గోసాలకు తరలించాలన్నారు. స్థానిక తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఈఓ 1.2 కేవివి సత్యనారాయణదొర, సూరయ్యారెడ్డి, ప్రిన్సిపల్స్ సత్యవేణి, కృష్ణారావు, ఎస్ఐ నరసింహ మూర్తి, అధికారులు, పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతో జీడిమామిడిలో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పోక్స్‌పేట పంచాయతీ కె.ఎర్రంపాలెం, దేవరాతిగూడెంలో జీడిమామిడి తోటలను డాక్టర్ ఫణికుమార్ శుక్రవారం సందర్శించారు. రైతులు చీడపీడల నివారణ ముందు జాగ్రత్తలు పాటించాలని కాండం తొలిచే పురుగు, టీ దోమ, తామర పురుగు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని యూరియా, సూపర్, వేపపిండి, సుడోమనాస్ అధికారుల సూచనల అనుగుణంగా వాడాలని కొమ్మలు కత్తిరింపు వలన అధిక పిలకలు వచ్చి కొత్త చిగురు వేసే అవకాశం ఉంటుందని సూచించారు. బూజు తెగులు డిసెంబర్‌లో రావచ్చని తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఉద్యాన పరిశోధన సంస్థానం పందిరిమామిడిలో శాస్త్రవేత్తలు అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్పంచ్ పండా లక్ష్మీ నాగు, ఉప సర్పంచ్ కారం సురేష్‌బాబు, హార్టికల్చర్ అసిస్టెంట్ సారపు జోగిదొర పాల్గొన్నారు.

మాజీ మంత్రి కురసాల కన్నబాబుకు పరామర్శ

ప్రజాశక్తి- జికెవీధి: మాజీమంత్రి, వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు తండ్రి మృతి చెందారు. ఆయనను గూడెం కొత్తవీధి మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంటిబాబు, ఉపాధ్యాయులు బాలకృష్ణ సీనియర్ నాయకులు కంకిపాటి నారాయణ, చల్ల నరేష్ తదితరులు శుక్రవారం పరామర్శించారు.

చందాల వసూళ్లకు రోడ్లపై తాడు పెట్టొద్దు

ప్రజాశక్తి - జీకేవీధి : మండలంలోని వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు ముఖ్యంగా పిల్లలు రోడ్డుకి అడ్డుగా తాడుపెట్టి చందాలు వసూలు చేస్తున్నారని వాటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఇటువంటివి చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యా రంగ సమస్యలపై.. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

- జిఒ 77 రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-చింతపల్లి :విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన స్థానిక డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి మెయిన్ రోడ్ మీదుగా చింతపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ నాయకులు బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ జీవో నెంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.1,500 బదులు రూ.3,000 మెస్ బిల్లు ఇవ్వాలని, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. హాస్టళ్లలో హెల్త్ వర్కర్లను, వాచ్మెన్లను నియమించాలని, అర్హులైన వారికి తల్లికి వందనం రూ.15వేలు ఎటువంటి అడ్డంకులు లేకుండా అందించాలని, విద్యార్థులకుఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కార్తీక్, జీవన్ కృష్ణ మాట్లాడుతూ చింతపల్లి మండలంలోని హాస్టళ్లలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బాయ్స్, గర్ల్స్ హాస్టల్స్‌లో మౌలిక వసతులు కొరత ఉందని పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు, సెకండ్ ఇయర్ ప్రమోట్ ఫీజుల భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చింతపల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ప్రభాస్, శ్రావణి, మౌనిక, అధిక సంఖ్యలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కళాశాల విద్యార్థులు

కార్మికులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఐటిడిఎ పరిధిలో అరకు వ్యాలీ గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, కొత్తవలస హెచ్‌ఎంటిసి ఫారం వంటి విభాగాలలో పని చేస్తున్న కార్మికులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ కార్యాలయం గేటు ఎదుట ఐటిడిఎ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 నుండి 13 సంవత్సరాల సీనియారిటీ కలిగిన సుమారు 50 మంది కార్మికులకు ఇప్పటికీ పిఎఫ్ సౌకర్యం కల్పించకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారన్నారు. కార్మికులు విధుల్లో చేరినప్పటి నుంచి పిఎఫ్ బకాయిలను చెల్లించాలని, అందరికీ ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు, హక్కులను ఐటిడిఎ నిర్లక్ష్యం చేస్తుందని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఐటిడిఎ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాడిరాజు, నాయకులు రాంబాబు, రాజు, రాఘవ, జయరాజ్, అర్జున్, రంభ, శాంతి, అప్పలమ్మ, పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరరావు, కార్మికులు

సోమేష్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి -పాడేరు: జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మృతి చెందిన పలాసి సోమేష్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జి.మాడుగుల మండలం కోడాపల్లి సమీపంలో జాతీయ రహదారి నిర్మిస్తున్న సుధర్మ కంపెనీ నిర్లక్ష్యంతో యువకుడు ప్రాణం కోల్పోయాడన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ రహదారి అధికారులు, సుధర్మ కంపెనీ బాధ్యత రహితంగా వ్యవహరిస్తుందన్నారు. కల్వర్టు కోసం తీసిన గొయ్యిని మూయకపోవడంతో కొడపల్లి లో పలాసి సోమేశ్ కుమార్ అనే ఆదివాసి యువకుడు ప్రమాదవసత్తు మృతి చెందడం విచారకరమన్నారు. తక్షణమే ప్రభుత్వ స్పందించి జాతీయ రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని మృతి చెందిన కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారాన్ని ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌కు 119 అర్జీలు



వినతులను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: వినతుల పరిష్కారం వేగవంతం చేయాలని, అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని ఐటిడిఎ ఇంచార్జీ పిఒ, జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ సూచించారు. ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలత సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన తాగునీటి, రహదారులు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, అటవీ హక్కు పత్రాలు, రోడ్డు విస్తర్ణలో దుకాణాలు నష్టపోయిన దుకాణాలకు ప్రత్యామ్నాయంగా భూముల కేటాయింపుపై అర్జీదారుల నుండి 119 వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు...

చింతపల్లి మండలం బెన్నవరం గ్రామ పంచాయితీ నక్కమెట్ల గ్రామం చెందిన వంతల త్రినాద్, పోతురాజు గుమ్మాల గ్రామానికి చెందిన మర్రి సాంబ శివరావు గ్రామంలో మినీ గోకులం షెడ్స్ నిర్మించడం జరిగిందని బిల్లులు నేటికీ చెల్లింపులు జరగలేదని, సంబంధిత బిల్లుల సొమ్ము మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం మఠ్రిపుట్టు గ్రామానికి చెందిన సిహెచ్ కాంతమ్మ తనకి వికలాంగుల పెన్షన్ ఇప్పించాలని వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం కొంతిలి గ్రామానికి చెందిన ఎ.సత్యవతి తనకు కొంతిలి గ్రామంలో 80 సెంట్ల భూమి ఉందని, ఆ భూమి కొందరు ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. హుకుంపేట మండలం బి.బొడ్డపుట్టు పంచాయతీ, దబ్బగురువు గ్రామానికి చెందిన వి.రాజులమ్మ తన భర్త 2021వ సంవత్సరం మరణించారని, పెన్షన్ కోసం అప్పటి నుండి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ మంజూరు కాలేదని తెలిపింది. దుంబ్రిగూడ మండలం కొల్లాపుట్టు గ్రామ పంచాయితీ పరిధిలో డెక్కపురం గ్రామములో సుమారు 25 కుటుంబాలు నివాసిస్తున్నారని, గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, బొడ్డ మామిడి జంక్షన్ నుండి డెక్కపురం గ్రామం వరకు తారురోడ్డు మంజూరు చేయాలని కోరారు. జి.మాడుగుల మండలం కొత్తపల్లి గ్రామ నివాసి వంతల మచ్చమ్మ హౌసింగ్ లిస్ట్ లో తనపేరు ఉందని, లింటల్ లెవెల్ వరకు నిర్మాణం జరిగిందని బిల్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ డిసి ఎంవివిఎస్ లోకేశ్వరరావు, డ్వామా పిడి విద్యాసాగర్, డిఇఒ పి.బ్రహ్మాజీ, డిఆర్ డిఎ పిడి మురళీ, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి విఎ స్వామి నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పాడేరు: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ రావుకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రావుల జగన్మోహన్ రావు మాట్లాడుతూ పాఠశాలలలో అసిస్టెంట్ బుక్స్ మూలంగా ఉపాధ్యాయులకు అదనపు ఒత్తిడి తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు , ఇప్పటికే మాన్యువల్ గా పేపర్ లో దిద్దడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని, దీంతో అదనపు భారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, శాంతకుమారి, కృష్ణారావు,. దొర, భైరవమూర్తి, గిరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలపై యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు :: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ మండల అసోసియేట్ ప్రెసిడెంట్ చిట్టపులి త్రినాధం ఆధ్వర్యంలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి కోడా కృష్ణమూర్తి కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి మొశ్యా. ధర్మారావు మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి, నూతన భవనాలు మంజూరయ్యేలా ప్రతిపాదనలు అధికారులకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీస్ మేటర్స్ పరిష్కరించాలని, డిప్యూటేషన్ లో ఉన్న ఉపాధ్యాయుల హాజరు విషయమై తగు చర్యలు తీసుకోవాలని, సర్వీస్ రిజిస్టర్స్ సకాలంలో అప్డేట్ చేయాలని, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ ట్రాన్స్ఫర్టేషన్ చార్జీలు ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు. బోధనేతల పనుల నుండి మినహాయించి గిరిజన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలని, పెండింగ్ ఇయల్స్ బిల్స్ మంజూరు పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల జనరల్ సెక్రెటరీ సీసా. గోపి, ట్రెజరర్ కే.శ్రీనివాసమూర్తి, జిల్లా కౌన్సిలర్ కె.సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పి గోవింద్, కె. తిరుపతిరావు, సిహెచ్. రఘుమణి, ఎ.ధనుపతి పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-చింతపల్లి : మండల పరిధిలో వినాయక ఉత్సవాలు సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుగా పోలీసుల నుండి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని చింతపల్లి సీఐ ఎం.వినోద్‌బాబు అన్నారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు చింతపల్లి, అన్నవరం ఎస్సైలు వెంకటేశ్వరరావు, వీరబాబుతో శుక్రవారం ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు భక్తులు https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అన్న సమారాధన కార్యక్రమాల వివరాలను కనీసం ఒక రోజు ముందు పోలీస్ శాఖకు తెలియజేయాలన్నారు. ఊరేగింపుల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, బాణాసంచా వాడకాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. వివాదాస్పద స్థలాలు. అసౌకర్యంగా ఉన్న ప్రధాన రహదారులపై విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



మాట్లాడుతున్న సిఐ వినోద్ బాబు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-చింతపల్లి : మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి ప్రమాదకరమని, యువత ముఖ్యంగా విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని చింతపల్లి సీఐ ఎం.వినోద్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక ఐటిఐలో ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేకంగా 'ఈగల్' బృందం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డ్రగ్స్ వాడకం వలన కొత్త అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, ఆర్థికంగా కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయని చెప్పారు. గంజాయి సరఫరా, రవాణా, నిల్వ వంటి పనుల్లో పాలుపంచుకునే వారిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిసిన పక్షంలో ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972 లేదా వాట్సాప్ నెంబర్ 8977781972కు తెలియజేయాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రమణ, కె.ఆనంద్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.



విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

ఉపశమన సంరక్షణపై శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ: తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రత్యేకమైన వైద్య సంరక్షణను ముఖ్యంగా శారీరక, మానసిక, సామాజిక ఒత్తిడులను దూరం చేసే విధంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులకు పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ)పై రెండు రోజుల శిక్షణను శుక్రవారం జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఆధునిక వైద్య విధానంలో పాలియేటివ్ కేర్ ప్రాధాన్యతను వివరించారు. జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేషన్ బాలు, శిక్షణ కార్యక్రమ కోఆర్డినేటర్ టి.మాలతి పాల్గొని ఉపశమన సంరక్షణపై పలు అంశాలు వివరించారు. కార్యక్రమంలో హెూమిబాబా కేన్సర్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విద్య విశ్వనాధ్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ వి.పావని, గాయత్రి విద్యా పరిషత్ సైక్రియాట్రి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రావణి, గీతం నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.ఉషా పాల్గొని పాలివేటివ్ కేర్‌పై అవగాహన కల్పించారు. మెడికల్ అండ్ సర్జికల్ నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణనిచ్చారు.

పిల్లల దత్తతలో నిబంధనలు పాటించాలి



పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పిల్లల దత్తతంలో నిబందనలు అనుసరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఎంజె అభిషేక్ గౌడ ఆదేశించారు. పిల్లల దత్తత అంశానికి సంబంధించి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫోస్టర్‌ను ఐటిడిఎ మీటింగ్ హాల్ లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు లేని ఆరేళ్ల పైబడి 18 ఏళ్ల లోపు ఉన్న పిల్లలను రెండేళ్ల పాటు పెంచి ప్రేమానురాగాలు పంచిన అనంతరం శాశ్వత దత్తత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, డిఆర్ఒ కె.పద్మలత, డిఇఒ టి.బ్రహ్మజీ, డిఎల్ పిఒ పిఎస్ కుమార్, డిసిపిఒ .టి సద్దు, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని లంబసింగి పంచాయతీ పరిధి చిట్టంగరువు గ్రామంలో సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం సర్పంచ్ కొర్ర శాంతకుమారి, చింతపల్లి ఐటిడిపి ఇన్చార్జి వరికోటి మహేంద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. పిఎం మన్‌మన్ స్కీమ్ ద్వారా మంజూరైన రూ.35 లక్షల నిధులతో ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య, పీసా అధ్యక్షులు శివరామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బోనంగి సోమలింగం, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు పార్వతి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ఫెర్టిలిటీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



తనిఖీలు చేస్తున్న డిఎంహెచ్ఒ నేతృత్వంలోని వైద్యనిపుణుల బృందం

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని పలు ఫెర్టిలిటీ కేంద్రాలను డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు, అధ్యక్షతన ఏడుగురు ఎఆర్‌టి, సరోగసి బృందం వైద్యులు తనిఖీలు చేపట్టారు నోవా ఐవిఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాలను తనిఖీ చేసిన బృందం పలు సూచనలు చేశారు. ఆపరేషన్ థియేటర్, వార్డ్, స్కానింగ్ మెషిన్ పిరిశీలించారు. ఎఆర్‌టి కేంద్రాల నిర్వహణ అనుమతులు, నిపుణులైన వైద్యులు, సిబ్బంది, ల్యాబ్ పరికరాలు ఉన్నాయో లేవో పరిశీలించారు. తనిఖీ బృందంలో విజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, కెజిహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ .రాధ, పేథాలజిస్ట్‌డాక్టర్ .టి.కిషోర్, సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, ఎల్.వి.రమణి, కె.శివాజీ, డాక్టర్ .బి.ఉమావతి, డిపిఎంఒ బి.నాగేశ్వర రావు, డెవె పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రం వద్ద తుప్పల తొలగింపు

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- రంపచోడవరం: స్థానిక సాయినగర్ అంగన్వాడీ కేంద్రానికి వెళ్లేమార్గం అస్తవ్యస్తంగా ఉందని దీనివల్ల అంగన్వాడీ సెంటర్‌కి వెళ్లే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని 'ప్రజాశక్తి' వార్తాపత్రికలో 'చినుకు పడితే నరకమే' అని ప్రచురితమైన కథనానికి రంపచోడవరం సిడిపిఒ ఉమ స్పందించి సర్పంచ్, కార్యదర్శులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే స్పందించిన పంచాయతీ అధికారులు అంగన్వాడికేంద్రం చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు డ్రైనేజీ పనులు చేపట్టారు. చర్యలు తీసుకున్నామని ఉమ ఒక ప్రకటనలో తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారి ఆలయంలో చివర శ్రావణ శుక్రవారం కావడంతో అమ్మవారికి శాకంబరీ దేవిగా అలంకరణ చేసి తీర్చిదిద్దారు. పందిరి రామకృష్ణ భార్య లూసీ ఆర్థిక సహాయంతో అమ్మవారి అలంకారం జరిపారు. కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో బాలజీ రెస్టారెంట్ దంపతులు, బోలియశెట్టి లక్ష్మణరావు దంపతులు ఆర్థిక సహాయంతో స్వామివారికి ప్రసాదాలు సమర్పించారు.

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సు


ప్రజాశక్తి-సీలేరు: నర్సీపట్నం డిపోకు చెందిన నర్సీపట్నం వయా చింతపల్లి సీలేరు మీదుగా బస్‌సర్వీస్ శుక్రవారం ఉదయం నర్సీపట్నంలో బయలుదేరింది. చింతపల్లి కాంప్లెక్స్ వచ్చేసరికి సాంకేతిక లోపాలు తలెత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. సిబ్బంది డిపో మేనేజర్ కి సమాచారం చేరవేశారు. ప్రయాణికులను చింతపల్లి వచ్చిన టు స్టాప్ బస్సులో చేరవేయాలని ఆదేశించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘాట్‌రోడ్‌లో కండిషన్‌లో లేని బస్సులు నడపడం వలన తరచూ సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్టిసి అధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయున్ని నియమించకపోతే ఆందోళన

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం ఏ.దారకొండ పంచాయతీ గొల్లపల్లి జిపిఎస్ పాఠశాలలో తక్షణమే ఉపాధ్యాయుని నియమించకపోతే ఎంపిడిఒ, ఎంఇఒ కార్యాలయాలను విద్యార్థులు తల్లిదండ్రులు ముట్టడిస్తారని ఏ.దారకొండ ఉపసర్పంచ్ మురళి సత్తిబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జూన్ నుంచి ఇప్పటివరకూ గొల్లపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుని నియమించలేదన్నారు. పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువువుతున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, పిఒ స్పందించి ఉపాధ్యాయుని నియమించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి సూచించారు. గురువారం రాత్రి కింద్ర గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. గంజాయి వాడకం, సాగు, రవాణా చట్టవిరుద్ధమన్నారు. వినాయకచవితి సందర్భంగా విగ్రహ నిమజ్జనంలో ఎటువంటి అశ్లీలనృత్యాలు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. సారాతయారీ, విక్రయం ఆరోగ్యానికి హానికరమని కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గిరిజనాభివృద్ధికి కృషి చేయాలి




మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆది కర్మయోగి కార్యక్రమం ద్వారా గిరిజనాభివృద్ధికి అంతా కలసికట్టుగా కృషి చేయాలని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం రంపచోడవరం సమీపం లోని యూత్‌ట్రైనింగ్ సెంటర్ (వైటిసి)లో పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్, డివిజనల్ అభివృద్ధి అధికారి, ఎంపిడిఒలు, పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, వెల్ఫేర్‌అసిస్టెంట్లు, వివిధ శాఖల ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల19వ తేదీ నుంచి 21 వరకూ జిల్లాస్థాయి మాస్టర్‌ట్రైనర్లు, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్లకు మూడు రోజులపాటు ఆదికర్మయోగి, డిఎ జూగా, ప్రీతియోగి ప్రోగ్రాంలు అమలు చేసి విలేజ్ విజన్‌మ్యాపు తయారుచేసే విధంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. మండలస్థాయి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు పంచాయతీ స్థాయిలో మాస్టర్ ట్రైనర్లను అర్థమయ్యే రీతిలో మండలస్థాయి మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించాలన్నారు. మౌలిక వసతులు, సమస్యలను గిరిజనప్రజల సహకారంతో గుర్తించి విలేజ్‌విజన్ మ్యాప్ తయారుచేసి సమర్పించాలన్నారు. 2047 నాటికి ఏజెన్సీ ప్రాంతం రూపురేఖలు మార్చే విధంగా ఆది కర్మయోగి ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఏజెన్సీలో విలేజ్‌విజన్ మ్యాపు తయారుచేసి అందిస్తే ప్రభుత్వానికి నివేదిక పంపుతామని దాని ఆధారంగా సుమారు ఐదు సంవత్సరాల్లో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదికర్మయోగి విధి విధానాలు శిక్షణ పొందిన అధికారులు, సిబ్బంది గ్రామ విజన్ మ్యాపు తయారు చేసేందుకు నిధులు సమకూర్చుతుందన్నారు. విలేజ్ విజన్‌మ్యాపు తయారు చేయుటలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మారేడుమిల్లి ఎంపిడిఒ శ్రీనివాస్ విశ్వనాథ్ వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు. ఎంపీడీవోలువిజయ, లక్ష్మణ్, బాపన్నదొర, సాల్మన్‌రాజు, యాదగిరేశ్వ రరావు, జిల్లాస్థాయి మాస్టర్‌ట్రైనర్లు జి. శారదాదేవి, చంద్రకిరణ్, శిరీష, రామం, అచ్యుత్‌కిరణ్, ధ్రువకుమార్, మండల విద్యాశాఖాధికారులు ఎంవివి సత్యనారాయణ, తాతబ్బాయిదొర, బాపిరాజు, వీరరెడ్డి, ముత్యాలరావు, డిప్యూటీ ఎంపిడిఒ వై.రాజుబాబు, సహాయక గిరిజన సంక్షేమ శాఖాధికారులు రామతులసి, కృష్ణమోహన్, డిప్యూటీ ఇంజనీర్లు పి.వెంకటరమణ, నాగరాజు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్, రోడ్డు వేయాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం: వరదల సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని సిపిఎం నాయకులు తెలిపారు. పెద్ద ఆర్కూర్‌లో కలెక్టర్ దినేష్ కుమార్‌ని కలిసి వినతిపత్రం అందించామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం నుండి బురదగుడెం వరకూ ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కనుండి కొత్త విద్యుత్తులైన్ ఏర్పాటు చేయాలని, బురదగూడెం నుండి తుమ్మల గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. చిన్నాఆర్కూర్ బస్టాండ్ నుండి బోదునూరు వరకు రోడ్డు నిర్మించాలని కోరామని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ హామీ ఇచ్చారని తెలిపారు. రైతులు పట్టాభూమికి సంబంధించి పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రేపాక లైడర్‌సర్వే ప్రకారం 41 కాంటూరులో చేర్చడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారని, భగవాన్‌పురంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, గండికొత్తగూడెం రోడ్డు మంజూరు, అంగన్‌వాడీ భవనం మరమ్మతుకు హామీ ఇచ్చారు. సర్పంచ్‌నాగమణి, ఎంపిటిసి అమ్మాజీ, మాజీ ఎంపిటిసి పాయం సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

రాకపోకలు నిలిచిన గ్రామాలకు నిత్యావసరాలు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు డివిజన్ 4 మండలాల్లో వరదల వల్ల రహదారులు బంద్ అయి రాకపోకలు నిలిచిపోయిన పలు గ్రామస్తులకు నిత్యావసరాలు అందక ఇబ్బంది పడుతున్నారని తక్షణమే వారికి నిత్యావసరాలు పంపిణీ చేయాలని కూనవరం మండలంలో శబరి బెల్టు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతోందని తక్షణమే పరిష్కారం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతూరు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విఆర్‌పురం,కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి నిత్యవసరా లకు ఇబ్బంది పడుతున్నారని, నిత్యావసరాలు అందించాలని, మరబోటు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కూనవరం మండలంలో కొన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, ఇప్పటికైనా ప్రత్యామ్నాయ విద్యుత్తులైన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటి సభ్యులు సీసం సురేష్, మండల నాయకులు పొడియం లక్ష్మణ్, కారం నాగేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరసింహమూర్తి

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ఎటపాక : విద్యార్థి దశ నుంచే పొదుపు చేయడం అలవర్చుకోవాలని ఎపిజివిబి సీతాపురం శాఖ అధికారి నరసింహమూర్తి, తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్ అన్నారు. ఎటపాక మండలం సీతాపురం ఎపిజివిబి శాఖాధికారి ఆధ్వర్యంలో తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణలో విద్యార్థులకు జన్‌దన్ యోజన ఖాతాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్, నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జీరో అకౌంట్ ఓపెన్ చేసేందుకు అవకాశం కల్పించిందన్నారు. ప్రతి విద్యార్థి విధిగా వ్యక్తిగత బ్యాంక్‌ఖాతా కలిగి ఉండాలని తల్లిదండ్రులు ఇచ్చే నగదును చిల్లర ఖర్చులకు వృథా చేయకుండా ఖాతాల్లో జమ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, రైస్‌కార్డు రెండు ఫోటోలు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్‌మిత్ర లక్ష్మీ, ఉపాధ్యాయులు ఖాసీం, వరలక్ష్మి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలోని ప్రతి సబ్‌సెంటర్లో వివిధ వ్యాధులకు సంబంధించి మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని పిఒ సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం రంపచోడవరం మండలం ముసురుమిల్లి సబ్‌సెంటర్‌ను, అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రతి ఎఎన్ఎం సబ్ సెంటర్లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. సబ్ సెంటర్ పరిధిలో గ్రామాల్లో ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు పర్యటించి జ్వరాలున్న వారిని గుర్తించి రక్తనమూనాలు ఉచితంగామందులు అందజేయాలన్నారు. మలేరియా దోమలు ప్రబలకుండా మలేరియా స్ప్రేయింగ్ ప్రతి ఇంట్లో చేయించాలన్నారు. అంగన్వాడి కేంద్రాన్ని కూడా పరిశీలించి పిల్లలకు గుడ్లు, పాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఎడిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, మలేరియా అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- రంపచోడవరం : వివిధ మత పెద్దలుతో డిఎస్పి సాయి ప్రశాంత్ వినాయక ఉత్సవాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై రంపచోడవరంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నవరాత్రుల అనంతరం జరిపే ఊరేగింపులలో మరియు ఆలయాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఆలయ కమిటీ వారు జాగ్రత్తలు తీసుకోవాలని లేనిపక్షంలో వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐ సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్ఐ నాగభూషణం మత పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి సాయిప్రశాంత్

రాజవొమ్మంగి: జడ్డంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో వినాయకచవితి నేపథ్యంలో మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ చినబాబు శుక్రవారం తెలిపారు. మండపాలు ఏర్పాటుకు ఎటువంటి రుసుము చెల్లించవసరం లేదని గణేష్‌ఉత్సవ్.నెట్.డాట్ సైట్లో అన్ని వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఊరేగింపులు సమయానికి ముగియాలని, పోలీసుల సూచనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.